తేదీ 11-08-1987న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# జీవిత కళ

ఈనాడు జగత్తులో వ్యాపించిన అల్లకల్లోలములకు, అశాంతికి, అక్రమాలకు, అధర్మానికి కారణమేమిటి? వృద్ధులు గతాన్ని గురించి, యువకులు తమ భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ వర్తమానాన్ని మరచిపోవడమే నేటి అలజడులకు మూలకారణము. ఈ వర్తమానం త్రికాలాబాధ్యం. గడిచిన దాని పరిణామం వర్తమానంలో ఉంటుంది. రాబోయే భవిష్యత్తుకూడా వర్తమానంపైనే ఆధారపడి ఉంటుంది. నీవిప్పుడు బాగుంటే భవిష్యత్తులో నీ జీవితం మరింత దివ్యమైనదిగా, నవ్యమైనదిగా ఉంటుంది. ఈనాడు తప్పులు చేస్తే ముమ్ముందు అదేదారి పడుతుంది. కనుక ఏ పనైనా చేసేటప్పుడు హృదయపూర్వకంగా చేయాలి. వర్తమానంలో కర్తవ్య నిర్వహణకు కంకణం కట్టుకోవాలి. కర్తవ్యమే భగవంతుడు. ఆచరణే అర్చన. ఈ రెండింటికే మన జీవితాన్నీ, మన విద్యలను అంకితం గావించాలి. ఎప్పుడో రాబోయే దినం గురించి యోచిస్తే రేపటివరకు ఉంటామనే నమ్మకమేముంది? నిన్నటి దినం గడిచి పోయింది. ఎన్ని కోట్లు పెట్టినా అది తిరిగి వెనుకకు రాదు. “గతం గతః ”. గతాన్ని విస్మరించండి. భవిష్యత్తు గురించి కలవరపడకండి, వర్తమానంలో జీవించండి. ఆనందాన్ని అనుభవించండి. వర్తమానంలో సంతోషంగా ఉంటూ మీ మీ కర్తవ్యాలను నిర్వర్తించండి.

**అపకారికి ఉపకారం**

కన్న తల్లిదండ్రులకు, పోషించినవారికి, బోధించిన గురువులకు, చేపట్టినవారికి కృతజ్ఞులై ఉండటం మానవత్వానికి ప్రధాన లక్షణం. కాని, ఈనాడు కృతజ్ఞత క్రూరత్వంగా మారిపోయింది. మంచి చేసినవారికే చెడ్డ చేస్తున్నారు. ఉపకారం చేసిన వారికే అపకారం తలపెడుతున్నారు. అపకారం చేసినవారికైనా ఉపకారం చేయడానికే ప్రయత్నం చేయాలి, కాని ఉపకారికి అపకారం చేయడం ఎంత తప్పు? “అపకారికి నుపకారము నెపమెన్నక

srisathyasaivachanamrutam

చేయువాడు నేర్పరి సుమతీ” అన్నారు. అపకారం చేసిన వారికికూడా ఉపకారం చేసే దివ్యత్వం ఉండాలి. సంకుచిత భావాలతో సంకుచిత మార్గం అవలంబించరాదు. మనమందరం భారతీయులమే! అందరూ ఒక తండ్రి బిడ్డలే! మానవజాతి ఏకత్వాన్ని మనం గుర్తించాలి. 'కులం, మతం' అనే సంకుచిత భావాలు అభివృద్ధి గావించుకోవటంచేత మానవులు పశువుకంటే హీనస్థితికి దిగజారిపోతున్నారు. మతాలు, కులాలు మనం కల్పించుకున్నవి. మానవ కులమంతా ఒక్కటే! నేను క్రైస్తవుడను, హిందువును, ముస్లింను అని అనుకొంటున్నాడు, మతతత్త్వం తెలియని మూర్ఖుడు. మతంపేరిట మతులు చెడగొట్టుకొంటున్నారు. మతి చెడినవాడి స్థానము, పిచ్చాస్పత్రి. ప్రపంచంలో వానికి ప్రవేశం లేదు. సంకుచిత భావాలు, ప్రాంతీయ దురభిమానాలు మనలో ఏమాత్రం ఉండకూడదు. దేశ విశిష్టతను, గౌరవమర్యాదలను కాపాడ లేనట్టి చదువులు ఎందుకు? డిగ్రీలు తీసుకొని ఉద్యోగాలకోసం భిక్షమడిగే స్థితికి రాకూడదు, భారతీయులు. స్వశక్తిపై ఆధారపడి జీవితాలు గడిపే శక్తిని సంపాదించుకోవాలి. ఆశక్తి దైవత్వంతో కూడినది. దీనివల్లనే మానవత్వంలోని దివ్యత్వం అభివృద్ధి అవుతుంది.

**ఆదర్శ జీవితం**

విత్తనం మట్టిలో పెట్టి నీరు పోస్తే మొక్క వస్తుంది. డబ్బాలో పెట్టి నీరు పోస్తే కుళ్ళిపోతుంది. సత్యమనే మొక్క ఆధ్యాత్మికమనే క్షేత్రంలోనే అభివృద్ధిగాంచుతుంది. ప్రతి మానవునికి ఆధ్యాత్మిక తత్త్వం అవసరం. ఆధ్యాత్మిక తత్త్వం లేకపోవటం చేతనే ఈనాడు దేశంలో నైతిక విలువలు దినదినానికి దిగజారిపోతున్నాయి. తల్లిదండ్రులంటే గౌరవం లేదు. భార్యాభర్తలలో విశ్వాసం లేదు. బిడ్డలమీద విశ్వాసం లేదు. ఇలాంటి అవిశ్వాసంతో కూడిన బ్రతుకు ఎందుకు? మనం తినే తిండి, మన ఒంట్లో ఉన్న రక్తం, మన తెలివితేటలు సర్వం తల్లిదండ్రుల ప్రసాదమే! అలాంటి తల్లిదండ్రులకు కృతజ్ఞత చూపాలి. ఈనాడు పిల్లలు మితిమీరిపోయి తల్లిదండ్రుల మతులు చెడగొడుతున్నారు. రేపు మీ పిల్లలు మీ మతులు చెడగొడితే మీకెట్లా ఉంటుందో ఆలోచించుకోండి! విత్తనమెట్టిదో మొక్క అట్టిది. ఎట్టి మొక్కనో అట్టిఫలము. భవిష్యత్తులో బాగుపడాలంటే వర్తమానంలో వారిని

గౌరవించాలి. దివ్యమైన ఆదర్శమైన జీవితం అందించాలి. సత్యజ్ఞానాన్ని అభివృద్ధిపరచుకోవాలి.

ఏవో కొన్ని సబ్జెక్టులు మీరు నేర్చుకోవచ్చు. ఉత్తీర్ణులు కావచ్చు, అయితే అది పొట్టకూటికి. జీవిత ఉద్ధారంకూడా కావాలి కదా! జీవనోపాధితోటే జీవితం అంతం కారాదు. జీవిత పరమావధి ఒకటుండాలి. మనలో ఉన్న శక్తిని అనేక విధాలుగా పాడుచేసుకొంటున్నాము. చెడ్డ చూపు, చెడ్డ వినికిడి, చెడ్డ మాట, చెడ్డ ఆలోచన, చెడ్డ పనులు – వీటి ద్వారా మనలోని శక్తి నశిస్తున్నది. కన్నులతో చూస్తుంటే ఎంతో దివ్యశక్తి పోతున్నది. కన్నులులేనివారికి ఎంతో దివ్యశక్తి ఉంటుంది. కారణం, వారి కన్నుల ద్వారా దివ్యశక్తి నశించటం లేదు కనుక. కన్నులున్నవాడు పగటిపూట వేగంగా నడుస్తాడు. రాత్రి పూట తబ్బిబ్బైపోతాడు. కాని, కన్నులు లేనివాడు పగలు, రాత్రి ఒకే విధంగా నడుస్తాడు. వాడు శక్తిని వ్యర్థం చేసుకోవటం లేదు. కనుక, పగలైనా రాత్రి అయినా వానిలో సమత్వం ఉంటుంది. మూగ, చెవిటివాళ్ళల్లో శక్తి మరింత అధికంగా ఉంటుంది. ఇంద్రియాల వినియోగాన్ని తగ్గించుకొంటూ పోతున్నకొద్దీ శక్తి, తెలివితేటలు అధికమవుతుంటాయి. ఈనాటి విద్యార్థులు, విద్యార్థినులు ఉన్న తెలివితేటలనుకూడా అహంకారంతో పాడు చేసుకొంటున్నారు. విషయ పరిజ్ఞానం ఉన్నంత మాత్రాన లాభంలేదు. జీవితంలో సమత్వం, సంతులనం రావాలి.

**జిరాఫీ తత్వం**

నేటి విద్యార్థులు జిరాఫీ మాదిరి తయారవుతున్నారు. జిరాఫీ మెడ చాలా పొడవు. తల అంత ఎత్తున ఉంటే మొండెం ఎక్కడో తలకు చాలా దూరంలో ఉంటుంది. జిరాఫీ స్వరూపమది! విద్యార్థులకుకూడా విచారణ ఒక చోట, హృదయం మరొక చోట ఉంటుంది. యోచించేది ఒకటి, చేసేది మరొకటి. ఈ విధంగా ఉండటంచేతనే మానవత్వం క్షీణించిపోతున్నది. మనస్సులో చింతన ఒకటి, నోటితో చెప్పటం ఒకటి, చేతితో చేసేది మరొకటి. ఇలాంటివారు మానవులుకారు, దానవులకంటే హీనులు.

పక్షికి రెండు రెక్కలవలె, బండికి రెండు చక్రాలవలె మానవునికి ఇహము, పరము



sri sathyasai vachanamrutam

రెండూ ఉండాలి. పరమంటే ఏమిటో అర్థంకాదే! అర్థంకానిదానిని ఎందుకు పట్టుకోవాలి, అని అనుకోవచ్చు. అర్థంకానిదే అర్థాన్ని చూపిస్తుంది. మీరీ జగత్తును చూస్తున్నారు. ఇదే స్వర్గం అంటారు. నా దృష్టిలో సర్వం శూన్యం. శూన్యమే స్వర్గం, దీనిని మీరు చక్కగా గుర్తించాలి. ఏది కంటికి కనిపించడం లేదో, చెవులకు వినిపించడం లేదో, ఏది అర్థం కావడం లేదో అదే కనిపింపజేస్తుంది, వినిపింప జేస్తుంది, అర్థాన్ని చూపిస్తుంది.

**కనిపించనిదే సర్వం**

"కనిపించనిదే తినిపించును మన కర్మ ఫలమును, మర్మము జీవా" ఏది కనిపించడం లేదో అదే అనుభవింపజేస్తుంది. కనిపించనిదానినే పట్టాలి. కనిపించేదానిని పట్టి ప్రయోజన మేమిటి? చెట్టు ఉంది, పెద్దగా పెరిగింది. దండిగా పువ్వులు పూశాయి. కాయలు కాశాయి. పండ్లమీద, పూలమీద నీరుపోస్తే అవి రాలిపోతాయి. వేర్లకు నీరు పోయాలి. కనిపించని వేరుకు నీరు పోసినప్పుడే కనిపించే ఫల పుష్పాలను మనం పొందగలము. ఆధారమైనదానిని గురించి విచారణ సలుపకుండా ఆధేయాన్ని తీసుకోకూడదు. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి - ఈ మూడింటిని మనం ఏకం చేయాలి. కుండలు ఎట్లా తయారు చేయాలని తెలుసుకున్నంతమాత్రాన కుండలు తయారుకావు. కుండలు తయారు చేయాలంటే మట్టి తేవాలి, తొక్కాలి, మెత్తబరచాలి. ఇంతటితో తయారవుతాయా? కావు. అవి చెయ్యాలి. అదే క్రియాశక్తి. కుండలు చేయాలనే ఇచ్ఛాశక్తి, ఎట్లా చేయాలనే జ్ఞానశక్తి, కుండలు తయారు చేసే క్రియాశక్తి ఈ మూడు కూడినపుడే కుండ తయారవుతుంది. కేవలము ఇచ్ఛాశక్తి ఉన్నంత మాత్రాన కుండ రాదు. కేవలం జ్ఞానశక్తి ఉన్నంత మాత్రానకూడా కుండ కాదు, వీటికితోడు క్రియాశక్తి ఉండాలి.

ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి - ఈ మూడు ఉన్నప్పుడే మానవుడు త్రిమూర్త్యాత్మకస్వరూపంగా మారుతాడు. త్రిమూర్తులనగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. వీరెక్కడ ఉన్నారు, ఎవరు చేశారు అని మీరనుకోవచ్చును. వీరెక్కడో ప్రత్యేకంగా లేరు. సత్వరజో తమో గుణములే ఈ త్రిమూర్తి స్వరూపములు. సాత్వికం విష్ణు స్వరూపం. తామసికం శివ స్వరూపం. సృష్టి కర్తయైన బ్రహ్మ స్వరూపం రాజసికం. ఈ మూడు

srisathyasai vachanamrutam

గుణములు మనయందే ఉన్నాయి. “త్రిగుణం త్రిదళాకారం, త్రినేత్రంచ, త్రియాయుధం. త్రిజన్మ పాప సంహారం ఏక బిల్వం శివార్పణం” – అదే మానవత్వం. హృదయమనే క్షేత్రమందు కలదు ఒక్క కల్పతరువు, దానిచుట్టు వనస్పతులు కలుపు కంప పెరిగియుండు, కలుపు తీసి శుభ్రపరచ కల్పతరువు కానబడును.

**చదువు సారం**

మనము కలుపుమొక్కలను పెంచుకొంటున్నాము. కాని, పంటమొక్కలను పెంచుకోవడం లేదు. మొట్టమొదట మన హృదయంలో లక్ష్యాన్ని గురించి విచారణ చేయాలి. చదువు సారాంశాన్ని గుర్తించాలి. మన నడక, మన నడత సరిగా ఉండాలి. ఇదే నీతి, నిజాయితీ అంటే. ‘నీతి’ అనగా చక్కని ప్రవర్తన. ‘నీతి లేని జాతి కోతి జాతి; నీతి గల జాతి నిజమైన జాతి’. జాతికి నీతియే ప్రధానమైనది. అది చదువుద్వారా వచ్చేది కాదు. గురువులు బోధించేది కాదు. గ్రంథాలలో చదివేది కాదు. ఒకరు ఇచ్చేది కాదు. కొనుక్కునేది కాదు. హృదయంనుండి ఆవిర్భవించాలి. నిత్య జీవితంలో దానిని ఆచరణరూపకంగా అభివృద్ధి పరచుకోవాలి.

ఈనాడు ఇంటర్మీడియెట్ పూర్తికాగానే ఇంజనీరింగ్ కాలేజీకో మెడికల్ కాలేజికో పోతున్నారు. తల్లిదండ్రులుకూడా లేత మొక్కలుగా ఉన్నవారిని తీసుకుపోయి ఇంజనీర్ కావాలి, డాక్టర్ కావాలి, దండిగా సంపాదించాలని ఆయా కాలేజీల్లో చేర్పిస్తున్నారు. కావలసింది గుణ సంపాదనా ధన సంపాదనా? ధనం రావచ్చు పోవచ్చు, గుణం వచ్చేదీ పోయేది కాదు. గుణం మళ్ళీ రాదు. ఇంటర్ కాగానే ఇంజనీరింగుకు పోవటంవల్ల బుద్ధి వికసించక యాంత్రికంగా తయారవుతున్నారు. ప్రపంచ జ్ఞానం ఏమాత్రం తెలియదు. ఆ ఇంజనీరింగులోనే పడిపోతారు. మెడికల్ కాలేజీకి పోగానే పీనుగులు కోసి కోసి వీడూ పీనుగైపోతాడు. ఇంక ప్రపంచ జ్ఞానం ఎట్లా వస్తుంది? ప్రాపంచికంగా చూసుకోవడానికి భాషకూడా అభివృద్ధికాక పాడైపోతుంది. ఇంగ్లీషు ఏమీ రాదు. కనీసం డిగ్రీ తీసుకున్న తర్వాత ప్రపంచ జ్ఞానంలోను అన్ని సబ్జెక్టులలోను ఆరితేరి ఉండాలి. అన్ని విషయాలలో అవసర జ్ఞానం సంపాదించి ఆ తర్వాత ఇంజనీరింగుకో మెడిసిన్‌కో పోతే మంచిది.

sri sathyasai vachanamrutam

### సమాజానికి కృతజ్ఞత

మీరీనాడు చదివిన చదువుకు, రేపటి జీవితానుభవానికి ఏమాత్రం సంబంధం లేదు. మీరిప్పుడు చదువుతున్నారు. తర్వాత పెండ్లి చేసుకుంటారు. మీ భర్త ఇంటికి పోయి భర్తగారు, అత్త మామలు చెప్పినట్లు వినవలసిందే! అంతకు మించి మీరు ఉద్యోగాలు చేయుటకు వీలుకాదు. అప్పుడు ఈ చదివిన చదువు ఏమైపోతుంది? ఏ కొంతమందికో ఉపయోగిస్తుంది ఈ చదువు. కనుక చదివిన చదువులలో నిత్య జీవితానికి అవసరమైన చదువులేమిటో వాటిమీద లక్ష్యం పెట్టాలి. సమాజంలో ఏ విధంగా బ్రతకాలి? సమాజాన్ని ఏ విధంగా గౌరవించాలి? 'సమాజంలో పుట్టాను, పెరిగాను, సమాజంలో జీవిస్తున్నాను. సమాజానికి నానుండి కలిగే ప్రయోజనమేమిటి?' అని ఆలోచించి అందుకు అనువైన విద్య నార్జించాలి. అంతో యింతో సమాజానికి ఉపయోగకరమైన జీవితాన్ని గడపాలి. కీర్తి, గౌరవం, అభివృద్ధి సర్వమూ సమాజంనుండే పొందుతున్నాము. సమాజానికి కృతజ్ఞతైనా చూపనక్కరలేదా? చేతినుండి కర్చీఫ్ కింద పడితే దానిని అందించినవారికి కృతజ్ఞత చెప్పుతారు. సమాజం ఎన్ని విధాల మీకు ప్రయోజనకరంగా ఉంటున్నది? సమాజానికి కృతజ్ఞతనేమైనా చూపిస్తున్నారా? ఏమీ లేదు. మొట్టమొదట తన ప్రవర్తనవల్ల ఎవరికైనా బాధ కలుగుతున్నదా అని విచారించాలి. తన ప్రవర్తవల్ల తల్లిదండ్రులు ఆనందిస్తున్నారా, దుఃఖిస్తున్నారా ఆలోచించాలి. 'నా సంతోషమే నాది, నా సుఖమే నాది, నా ఆనందమే నాది. ఇతరులు ఎట్లాపోతే నాకేమి', అనుకోకూడదు. పశువైనా ముందు, వెనుకలు ఆలోచిస్తుంది. పచ్చగడ్డి చూపితే ముందుకు వస్తుంది. తుంటకర్ర చూపితే పరుగెత్తిపోతుంది, పశువుకంటే మీలో ఉన్న విశిష్టత ఏమిటి? ఇన్ని డిగ్రీలు తీసుకొని ఏమి ఆదర్శం చూపిస్తున్నారు? కనుకనే ఆదర్శాన్ని చూపే విద్య కావాలి. సమాజ సేవ చెయ్యాలి. 'చదువుకున్న వాళ్ళము. ధరించిన వస్త్రం నలిగిపోకూడదని అనుకోకూడదు. నడుము వంచి పని చేయాలి. పనిలోనే ఆదర్శం ఉంది. నిత్య జీవితంలో ఆదర్శాన్ని మనం క్రియలో చూపించాలి. క్రియలేక మాటలతో ప్రయోజనం లేదు.

### స్త్రీలదే బాధ్యత



sri sathyasai vacanamrutam

స్త్రీలు అత్యంత మెలకువతో మెలగాలి. జగత్తంతటికీ స్త్రీలే మూలకారణం. లక్ష్మీనారాయణ, పార్వతీపరమేశ్వర, సీతారామ, రాధాకృష్ణ–నామాలలో స్త్రీ పురుష జంట పదములు వస్తుంటాయి. స్త్రీ పేరు మొదట వస్తుంది ఎందుకు? స్త్రీ అంటే ప్రకృతి. ప్రకృతి–పరమాత్మ జడ చైతన్యముల స్వరూపాలు. లక్ష్మీనారాయణ అంటే 'లక్ష్మి, నారాయణుని సతి', అని భావించరాదు. లక్ష్మి, ప్రకృతి–నారాయణుడు, పరమాత్మ. మొట్టమొదట ప్రకృతిని ఆశ్రయిస్తున్నాము. పరమాత్ముని పొందుతున్నాము. ప్రకృతి, పరమాత్మల సమ్మిళితస్వరూపమే ఈ జగత్తు. 'స్త్రీ' అనగా ప్రకృతి. కనుక, ప్రకృతి ఆదర్శవంతంగా ఉండాలి. పంచభూతములు, పంచప్రాణములు, పంచకోశములు ప్రకృతియందే ఉంటున్నాయి. అన్నిటికీ ప్రకృతే ఆధారం. ప్రకృతిని ఆశ్రయించి పరమాత్మను విస్మరిస్తేకూడా ప్రయోజనం లేదు. ప్రకృతిద్వారా మనం పరమాత్మను పొందాలి. అంటే మన దేహంద్వారా అన్నమాట. అందువల్లనే ఆత్మతో కూడుకున్న ఈ శరీరాన్ని అక్షరమని అన్నారు. అక్షరమంటే అ–క్షరము అనుకుంటారు, కాదు కాదు. అక్షరమంటే క్షరాక్షరముల చేరిక. అక్షరమనగా శాశ్వతమని, క్షరమనగా అశాశ్వతమని సామాన్యంగా అనుకుంటారు. కాని అక్షరములోనే శాశ్వతము, అశాశ్వతము రెండూ ఉన్నాయి. అ–క్షర. 'అ' అనగా ఆత్మ; 'క్షర' అనగా శరీరము. నశించిపోయే శరీరమైన క్షరము, నశించని ఆత్మ అనే 'అ'కారము రెండూ చేరినదే అక్షరము. ఆత్మ+నశించిపోయే శరీరము రెండింటి చేరిక అక్షరము. కనుక, మానవుడు అక్షరస్వరూపుడు.

**వినయం, భయం, విశ్వాసం**

భగవద్గీతయందు అక్షర తత్త్వము అంతరార్థములతో ప్రబోధింపబడినది. మనం అంతరార్థాలు చూడటం లేదు. పదాల అర్థాలు పరికించడం లేదు. క్షరము, అక్షర తత్త్వంలో అక్షర జ్ఞానము, పదజ్ఞానము – అన్ని జ్ఞానాలు మనలో ఉండాలి. అప్పుడే మానవత్వం అర్థమవుతుంది. లేకపోతే మానవత్వం వ్యర్థమైపోతుంది. కనుక, మానవత్వంలోని విశిష్టతను గుర్తించాలి. వినయంగా విధేయతను పెంచుకోవాలి. వినయమే మనకు ప్రధానమైనది. వినయం లేకుండా గర్వపోతుగా జీవించరాదు. గర్వపోతుకు సోమరితనం

sri sathyasaivacharamrutam

ఎక్కువ. సోమరత్వానికి ఎక్కడా స్థానం ఉండదు. తినడానికికూడా సోమరికి అధికారం లేదు. పనిచెయ్యాలి. కండలు కరిగితే పండ్లు కదలుతాయి. ఇంట్లో తిని కూర్చోవడం కాదు. సమాజసేవలో పాల్గొనాలి. మీకు క్లాసులో మార్కులు రాకపోయినా స్వామికి సంతోషమే; కాని జీవితంలో రిమార్కులు మాత్రం తేకూడదు. విశ్వాసమే శ్వాసగా భావించుకోవాలి. ప్రతిదానికి విశ్వాసం ఉండాలి. కొందరు 'మూఢ నమ్మకాలు' అంటారు. విశ్వాసం లేకుండా ఎవడు జీవించగలడు, లోకంలో? తెల్లవారి లేచి పరుండేవరకు ప్రతిపని విశ్వాసం పెట్టుకొనే చేస్తున్నాము. ఒక్క దైవ విశ్వాసమే లేనిది. ఒక సిద్ధాంతి వ్రాసిన పంచాంగాన్ని విశ్వసించి 'అమావాస్య' అని తర్పణాలు విడుస్తున్నాం. 'ఏకాదశి' అని వ్రతము చేస్తున్నాం. కాని 'తత్-త్వం-అసి', 'ప్రజ్ఞానం బ్రహ్మ'; 'అయమాత్మా బ్రహ్మ', 'అహం బ్రహ్మాస్మి' అని వేదం ఘంటాపథంగా చెప్పుతుంటే దానిని విశ్వసించడం లేదు. అశాశ్వతమైన దానిని సులభంగా విశ్వసిస్తున్నారు. నిత్య సత్యమైనదానిని విశ్వసించడం లేదు. ఈ బలహీనతను తొలగించుకోవాలి.

**లౌకిక కళలు కాదు.........**

విద్యార్థినులారా! మీరెంతో అదృష్టవంతులు. మీరీ కళాశాలలో చేరినందుకు మొట్టమొదట వినయ విధేయతలు నేర్చుకొని సమాజానికి ఆదర్శ జీవితాన్ని అందించి, తల్లిదండ్రులను సంతోషపెట్టాలి. మన విద్యా సంస్థలలో విద్య ఒక నిమిత్తం మాత్రమే! విద్యను నిమిత్తమాత్రంగా పెట్టుకొని మాత్రమే విద్యాలయములు ప్రారంభించాముగాని, వ్యాపారరంగంగా కాదు. ఈనాటి యువకులంతా భవిష్యత్తులో భారత వీరులవుతారు! అందుకు మీరు మార్గ దర్శకత్వం వహించాలి! మన కళాశాలలో అన్ని విధములైన కళలు అభివృద్ధి అవుతున్నాయి. జీవితకళ లౌకిక కళలన్నిటికంటే ప్రధానమైనది. సమాజంలో ఆదర్శంగా నిరూపించే కళలు మనం నేర్చుకోవాలి. అవే సత్యం, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస. అవే మన పంచప్రాణాలు. హింసా ధోరణులు, కల్లోలాలు మొదలైనవాటి జోలికి పోకుండా ప్రశాంత జీవితం గడపాలి. శాంత జీవితాన్ని, ప్రేమ జీవితాన్ని, సత్య జీవితాన్ని గడపాలి. ఇదే నిజమైన జీవితం.

srisathyasaivachanamrutam

ఈనాడు బి.ఇ.డి., కాలేజీకి ప్రారంభోత్సవం చేశాము. వచ్చే సంవత్సరం నుండి ట్రైనింగ్ కాలేజి అవుతుంది. మన కాలేజి విద్యార్థినులంతా ప్రతి విషయం ఆదర్శప్రాయంగా చేసి చూపించాలి. సాయిబాబా విద్యా సంస్థ అంటే విద్యార్థులు లోపల, బయట ఎట్లా ఉంటారు అని జగత్తు సహస్ర నేత్రాలతో చూస్తూ ఉంటుంది. ఐతే ఒకరి కోసమని కాదు. ఆడంబరాలకు పోనక్కరలేదు. మన తృప్తి మనకు కావాలి. తమ అంతరాత్మకు తృప్తికరంగా ఉండే విధంగా నడచుకోవాలి. అప్పుడు ఎవ్వరికీ దేనికి భయపడ నక్కరలేదు. ట్రైనింగు పూర్తి చేసి ఆదర్శవంతులైన విద్యార్థినులను తయారు చేయడానికి మీరు సిద్ధం కావాలని ఆశీర్వదిస్తున్నాను.

**(తేదీ 11-08-1987న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam